సచివాలయం.. స్పందన శూన్యం



కూనంనేనివారిపాలెం సచివాలయం

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లో ప్రతిరోజూ స్పందన కార్యక్రమం
- ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారం
- కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాల్లో నిలిచిపోయిన స్పందన
- సమస్యలపై మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్న అర్జీదారులు
- ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న కూటమి సర్కారుపై తీవ్రస్థాయిలో విమర్శలు

చీమకుర్తి రూరల్: ప్రజలకు ఎక్కడికక్కడే అన్నిరకాల ప్రభుత్వ సేవలను మెరుగ్గా అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. ఇప్పటికే సచివాలయాల ద్వారా అందించే సేవల సంఖ్యను పూర్తిగా తగ్గించి వేసింది. దీంతో 2019 సంవత్సరానికి ముందు పరిణామాలు మళ్లీ చోటుచేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రజలంతా వివిధ రకాల పనులపై మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. పలు రకాల సర్వేలతో పాటు గతంలో వలంటీర్లు అందించిన సేవలను ప్రస్తుతం సచివాలయ సిబ్బందితో చేయిస్తూ కూటమి సర్కార్ వేధిస్తోంది. దీనికితోడు సచివాలయాలకు–ప్రజలకు మరింత దూరం పెంచాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించిన స్పందన కార్యక్రమాన్ని ప్రస్తుతం అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అప్పట్లో సచివాలయాల్లో ప్రతిరోజూ నిర్వహించిన స్పందన కార్యక్రమాలలో కార్యదర్శులు, ఇతర ఉద్యోగులంతా పాల్గొని ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేవారు. ప్రస్తుతం సచివాలయాల్లో స్పందన కార్యక్రమాలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రతి సోమవారం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వెళ్లి తమ సమస్యలపై అర్జీలు అందించాల్సి వస్తోంది.

చీమకుర్తి మండలంలో 25 సచివాలయాల్లోనూ జరగని స్పందన కార్యక్రమాలు...

చీమకుర్తి మండలంలో మొత్తం 24 పంచాయతీలున్నాయి. చీమకుర్తి రూరల్ పరిధిలో 17 సచివాలయాలు, చీమకుర్తి అర్బన్ పరిధిలో 8 సచివాలయాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. అప్పట్లో వాటిలో ప్రతిరోజూ స్పందన కార్యక్రమాలు నిర్వహించి ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సచివాలయాల్లో స్పందన కార్యక్రమాలు నిలిచిపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంగాక స్థానిక ప్రజలు అవస్థపడుతున్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో మండల కేంద్రంలో, జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలకు వెళ్లి సమస్యలపై అర్జీలిస్తూ ప్రయాణాలు చేయలేక అల్లాడుతున్నారు. గ్రామాల్లోనే తమ సమస్యలపై అర్జీలు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

తిష్టవేస్తున్న సమస్యలు...

గ్రామాల్లోని సమస్యలను అధికారులకు నివేదించేందుకు మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో చాలా మంది ప్రజలు వెళ్లలేకపోతున్నారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు పూర్తిగా తిరిగే పరిస్థితి లేక వారి సమస్యలు చెప్పుకోలేకపోతున్నారు. దీంతో గ్రామాల్లో సమస్యలు తిష్టవేస్తున్నాయి. ప్రధానంగా భూ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.



సచివాలయాల్లో స్పందన కొనసాగించాలి

ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే సచివాలయాల్లో స్పందన కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. ఈ కార్యక్రమాన్ని నీరుగార్చకుండా గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలి. సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సమస్యలపై అర్జీలు స్వీకరించి నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి.

– సాదినేని వెంకటరావు, పులికొండ



మహిళలు, వృద్ధులకు చాలా కష్టంగా ఉంది

సచివాలయాల్లో స్పందన కార్యక్రమాలు నిలిచిపోవడంతో మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రానూపోనూ బస్సు చార్జీలు పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గ్రామ స్థాయిలోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది.

– ఏలూరి సురేష్, ఏలూరివారిపాలెం

క్లుప్తంగా

పాదచారులకు మజ్జిగ పంపిణీ



పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద పాదచారులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఒంగోలు బాపూజీ గో సంఘంలో గోమాతలకు ప్రత్యేక పూజలు చేసి మందిరంలో శ్రీకృష్ణుడిని దర్శనం చేసుకుని కేక్ కటింగ్ నిర్వహించారు. క్యాబినెట్ సెక్రటరీ రాఘవేంద్రరావు, వైస్ గవర్నర్ గుర్రం రంగనాథ్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు దర్శి చంద్ర, టంగుటూరి రంగస్వామి, రీజియన్ చైర్‌పర్సన్ చలువాది సత్యనారాయణ, జోన్ పర్సన్లు చలువాది కవిత, పబ్బిశెట్టి గోవర్ధన్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ స్వామి సత్యనారాయణ, పబ్బిశెట్టి వినోద్, నల్లమల్లి బద్రీనారాయణ, వేమూరి ప్రసాద్, క్లబ్ సభ్యులు నేరెళ్ల శ్రీనివాస్, కూనాల శ్రీనివాస్, వాసవీ క్లబ్ ఒంగోలు, సిటిజన్స్, విజన్, మహిళా విజన్, కేసీజీఎఫ్ యూత్, అన్ని క్లబ్బుల ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, ట్రెజరర్లు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలలో భాగంగా క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో సురేష్‌బాబు సూచించారు. చెత్త నుంచి సంపద తయారీపై మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో శుక్రవారం సంతనూతలపాడు మండల స్థాయిలో కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు అధ్యక్షత వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ నెల 24న నాగులుప్పలపాడు మండలానికి, 25న మద్దిపాడు మండలానికి సంబంధించిన సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండల స్థాయిలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎం.రమణమ్మ, సంతనూతలపాడు మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్ తయారు చేయాలి



కంపోస్ట్ పిట్టులో వానపాములు వదులుతున్న అజిత

చీమకుర్తి రూరల్: మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో తప్పనిసరిగా వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని మండల విస్తరణ అధికారి పి.అజిత సూచించారు. శుక్రవారం మండలంలో పడమటినాయుడుపాలెం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో వర్మీ కంపోస్ట్ తయారీకి వానపాములను కంపోస్ట్ పిట్టులో వదిలారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.కరుణాకర్ రెడ్డి, ఏడుకొండలు, శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి తోడ్పాటు



ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రార్థనలు చేస్తున్న చుండూరు రవిబాబు, నాయకులు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు

ఒంగోలు టౌన్: ముస్లింల అభ్యున్నతి కోసం వైఎస్సార్ సీపీ సంపూర్ణ తోడ్పాటు అందిస్తుందని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ మైనారిటీ, యువజన విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని ఇస్లాంపేట కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రంజాన్ మాసంలో 30 రోజుల పాటు ముస్లింలు ఉపవాసం ఉంటారని, ఎంతో నిష్ఠతో ప్రత్యేక నమాజులు ఆచరిస్తారని తెలిపారు. ఉపవాసాల వలన ఆకలి, దప్పికల విలువ తెలుస్తుందని, తద్వారా నిరుపేదల పట్ల సానుభూతి కలుగుతుందని అన్నారు. అందుకే ఈ మాసంలో ముస్లింలు దానధర్మాలతో గడుపుతారని, ఫిత్రా ద్వారా నిరుపేదలు కూడా తమతో సమానంగా పండుగ చేసుకునేందుకు సహకరించడం స్ఫూర్తినిస్తుందని అన్నారు. అల్లాహ్ దయ వలన ప్రతిఒక్క ముస్లిం కుటుంబానికి మేలు జరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్ మాట్లాడుతూ అల్లాహ్ దయ వలన యావత్ ముస్లింలకు మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రంజాన్ మాసంలోని ఆధ్యాత్మిక వాతావరణం మొత్తం సమాజం మీద సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందని చెప్పారు. నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని ముస్లింలు ఎంతగానో ఆదరించారని, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, కార్పొరేటర్లు గంగవరపు ప్రవీణ్, వెన్నపూస వెంకటరెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు చాంద్ బాషా, డివిజన్ అధ్యక్షుడు కాలేషా, హీదాయతుల్లా, రఫీ, అబీదుల్లా, జబీ తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో బహుళ ప్రయోజనాలు

- విద్యార్థులకు వివరించిన ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ మూర్తి

ఒంగోలు సిటీ: మారిన కాలానికి అనుగుణంగా నేటి ఆధునిక కంప్యూటర్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సమాజానికి బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఏఐని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి సూచించారు. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై శుక్రవారం అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు అధ్యక్షత వహించగా, వీసీ మూర్తి మాట్లాడుతూ సమాజం యావత్తూ కంప్యూటర్ యుగంలో పయనిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఏఐ ఎంతగానో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాలలోకెల్లా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు మాట్లాడుతూ నేటి కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని గణనీయంగా అభివృద్ధిపరిచేందుకు కళాశాల విద్య నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు అన్ని వ్యవస్థలలో ప్రత్యేకంగా కోర్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఏఐ పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు విద్యావంతులు, మేధావులు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అతిథి ఉపన్యాసకునిగా పాల్గొన్న విదేశీ విద్యావంతుడు, మాక్సీమస్ (యూఎస్ఏ)లోని సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎం.కిరణ్‌బాబు సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది విద్య, వైద్యం, వ్యాపార, ఉపాధి రంగాలలో ఎంతగానో అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఏఐ ప్రాధాన్యత రోజురోజుకీ గణనీయంగా పెరుగుతోందన్నారు. ఏఐ రంగంలో పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏకేయూ కళాశాల కంప్యూటర్స్ విభాగ సహాయక ఆచార్యులు కోలా సాయిబాబు, వై.సురేంద్ర తదితరులు ప్రసంగించారు. అనంతరం విదేశీ అతిథి ఉపన్యాసకుడు ఎం.కిరణ్‌బాబును వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, సహాయ ఆచార్యులు కోలా సాయిబాబు, వై.సురేంద్ర తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏకేయూ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంగోలు మహిళ నేత్రదానం



సత్యవతి (ఫైల్)

ఒంగోలు సిటీ: ఒంగోలుకు చెందిన తాతా సత్యవతి శుక్రవారం మరణించగా, ఆమె నేత్రాలను ఆచార్య భరద్వాజ సేవా సంస్థ, సూళ్లూరుపేట వారి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ వారికి సేవా సంస్థ వారు తెలియజేయగా, ఇన్‌స్టిట్యూట్ టెక్నీషియన్ ఉపేంద్ర వచ్చి సత్యవతి భౌతికకాయం నుంచి కార్నియాలు సేకరించి ఆమె కుటుంబ సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చీమకుర్తి రూరల్: చీమకుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.రాఘవేంద్ర తెలిపారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు వారి ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

పాలిటెక్నిక్ కాలేజీలో ఘనంగా వేడుకలు



విద్యార్థులతో జడ్జి రాజావెంకటాద్రి

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల గ్రామంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం కళాశాల వార్షికోత్సవం, జాబ్ అచీవర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒంగోలు ఏడో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి టి.రాజావెంకటాద్రి, కళాశాల స్థల దాత కుటుంబ సభ్యుడు జెట్టి శ్రీనివాసరెడ్డి అతిథులుగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ యేసు ప్రసాద్‌రావు అధ్యక్షత వహించగా, ముందుగా కళాశాల నుంచి క్యాంపస్ సెలెక్షన్స్‌లో వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సంపాదించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా రాజా వెంకటాద్రి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాల గురించి తెలుసుకోక ఎంతో మంది వారి జీవితాలను నాశనం చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులను ప్రశ్నలడిగి జవాబులు రాబట్టారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

30 రకాల విత్తనాలతో భూమి సారవంతం



30 రకాల విత్తనాల గురించి వివరిస్తున్న నరసింహులు

కొత్తపట్నం: పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేయడానికి 30 రకాల విత్తనాలు ఎద పెట్టడం ద్వారా భూమి సారవంతమై ఎటువంటి కాంప్లెక్స్ ఎరువులు వేయకుండానే పంటలు పండుతాయని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ నరసింహులు తెలిపారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం వారి ఆధ్వర్యంలో 30 రకాల విత్తనాల ఎండీఎస్ ఉపయోగాల గురించి రైతులు, డ్వాక్రా గ్రూపుల సభ్యులకు శుక్రవారం కొత్తపట్నంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసి పొలంలో చల్లుకోవాలని సూచించారు. ఇందులో కూరగాయలు, ఆకు కూరలు, తీగ జాతి, నూనె గింజలు, పచ్చిరొట్ట జాతులు ఉంటాయన్నారు. మొలక వచ్చిన 45 రోజుల తర్వాత వాటిని పశువుల మేతగా ఉపయోగించుకోవడమే కాకుండా పచ్చిరొట్ట ఎరువుగా భూమి లోపల కలియదున్నుకోవచ్చన్నారు. తద్వారా భూమి సారవంతంగా ఉంటుందన్నారు. పీఎండీఎస్ తర్వాత వేసే ప్రధాన పంటతో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. అంతేకాకుండా 365 రోజులు భూమిని పంటతో కప్పి ఉంచేందుకు చక్కని అవకాశమని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రెడ్డప్ప, సురేష్, మల్లేశ్వరి, మనోహర్ పాల్గొన్నారు.

ప్రతి రైతూ భూసార పరీక్షలు చేయించుకోవాలి

- సహాయ వ్యవసాయ సంచాలకులు సుచరిత



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో కిషోర్‌బాబు

ఒంగోలు సిటీ: ప్రతి రైతూ వారి పొలాలకు సంబంధించి భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాల పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకురాలు సుచరిత సూచించారు. శుక్రవారం కొప్పోలులో ఒంగోలు మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో భూసారం, భూమి ఆరోగ్యం పెంపుదల, భూసార పరీక్ష పత్రాల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సుచరిత మాట్లాడుతూ భూసార పరీక్షల వలన ఉపయోగాలను రైతులకు వివరించారు. ఎరువులు, సూక్ష్మధాతు మూలకాల వినియోగం, భూసార పరీక్షల ఫలితాల పత్రాలను ఆధారం చేసుకుని ఎరువులను వినియోగించాలని కోరారు. ప్రతి సంవత్సరం రైతులు తమ పొలాలను పరీక్ష చేయించుకోవాలని, అందులో ఉన్నటువంటి మూలకాల లోపాలను గుర్తించి సరిచేసుకుని భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని తెలియజేశారు. భూ పరీక్ష చేయించుకోకుండా అధికంగా ఎరువులు ఉపయోగిస్తే భూమిలో విలువల నిల్వలు ఉండి మొక్కలకు ఉపయోగపడకుండా భూమి తన సహజ స్థితిని కోల్పోతుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు, మాజీ సర్పంచి రఘు, వ్యవసాయ విస్తరణ అధికారులు రామకృష్ణారెడ్డి, ఆదిమూర్తి, వ్యవసాయ శాఖ గ్రామస్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల నిర్వీర్యం ఆపాలి



సమావేశం నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

చీమకుర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ బ్యాంకులను నిర్వీర్యం చేయడం మానుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కార్యక్రమంలో భాగంగా బ్యాంక్‌లను ప్రైవేటీకరణ చేయడాన్ని విమర్శించారు. కార్యక్రమంలో పల్లాపల్లి ఆంజనేయులు, పూసపాటి వెంకట్రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను పిలవకుండా శిక్షణ కార్యక్రమాలా.?



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణ

- అధికారులపై కె.పల్లెపాలెం సర్పంచ్ ఆనందరావు ఆగ్రహం

కొత్తపట్నం: సర్పంచ్‌ని పిలవకుండా పంచాయతీలో శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు ఎలా నిర్వహిస్తారంటూ మండలంలోని కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కె.పల్లెపాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఘన, వ్యర్థాల నిర్వహణపై శుక్రవారం ఒంగోలు, కొత్తపట్నం మండలాలకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. కొత్తపట్నం ఎంపీడీవో పి.కృష్ణ, ఒంగోలు ఎంపీడీవో రాజశేఖర్, ఈవోఆర్డీలు ఏ బాలచెన్నయ్య, వేణు, జిల్లా పంచాయతీ రిసోర్స్‌పర్సన్ చక్రధర్ హాజరవగా, రెండు మండలాల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎలా తయారు చేస్తారు, గ్రామాలను ఏ విధంగా శుభ్రంగా ఉంచుకోవాలి, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అయితే, ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్‌ని ఆహ్వానించకపోవడంతో కార్యక్రమం ముగిసిన తర్వాత సర్పంచ్ ఆనందరావు వచ్చి తనకు చెప్పకుండా తన పంచాయతీలో కార్యక్రమం ఎలా నిర్వహిస్తారని అధికారులను ప్రశ్నించారు. ఇటీవల ఏ ఒక్క కార్యక్రమానికీ తనకు ఆహ్వానం ఉండటం లేదని, దీనిపై వచ్చే సోమవారం ఒంగోలులో గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు అర్జీ ఇస్తానని తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సంపత్‌ను వివరణ కోరగా, పైకార్యక్రమం రెండు రోజులు ఉంటుందని, ఈ కార్యక్రమం గురించి సర్పంచ్‌లకు చెప్పాల్సిన అవసరం లేదని, కేవలం అధికారులకేనని అన్నారు.

పద్మజకు చుండూరు నివాళి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నేటి వెంకట ప్రసాద్ సతీమణి కర్నేటి పద్మజ శుక్రవారం మృతి చెందగా, ఆమె భౌతికకాయానికి పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు నివాళులర్పించారు. పద్మజ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.



పద్మజకు నివాళులర్పిస్తున్న చుండూరు రవిబాబు, నాయకులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: విద్యార్థులు చదువుతో పాటు ఉన్నతమైన లక్ష్యాలు ఎంచుకుని వాటిని చేరుకోవాలని స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల చైర్మన్ వై.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మంగమూరులోని ఎస్.ఎస్.ఎన్ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతల నడుమ సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర రెడ్డి, ఎన్.ఎస్.ఎస్ అధికారి టి.రాజేంద్రబాబు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.